

# ఎందుకే నీకింత తొందరా...

## - బలభద్రపాత్రుని రమణి



### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (గత సంచిక తరువాయి)

**ఎయిర్‌పోర్ట్‌కి** అమ్మా నాన్నా వచ్చారు. యాషీ కూడా వచ్చింది. దానికి కావలసిన కాస్మొటిక్స్, ఎలక్ట్రానిక్ గూడ్స్ లిస్ట్ నా చేతికిచ్చింది. అంటే ఫోన్లో ఫార్వర్డ్ చేసింది. "ఎవరైనా తెల్లకుర్రాడిని పట్టెయ్" అంది గుసగుసగా"

"వాళ్ళు తీసుకెళ్ళి ఏ కంటెనెయిర్‌లోనో పెట్టి అమ్మేస్తే, నీ ఎడ్రెస్ కూడా ఇస్తాలే" అన్నాను.

అదేవిటో సెక్యూరిటీ చెక్ఇన్ అయిపోగానే నాకు ఒళ్ళంతా తేలిపోతున్నట్లూ, ఒక్కసారిగా రెక్కలు వచ్చినట్లూ ఎంతో ఆనందంగా, ఆక్సిజెన్ లెవెల్స్ పెరిగిపోతున్నట్లు అనిపించాయి. పరాయి దేశాలకి పిల్లలు ఈ అమ్మా నాన్నలని వదిలించుకుని ఎందుకు వెళ్తారో అర్థం అయింది.

నెట్‌ఫ్లిక్స్‌లో డౌన్‌లోడ్ చేసిన సినిమా ఏదో చూడాలని ఇయర్ పాడ్స్ పెట్టుకున్నా. నా ఎదురుగా కెన్‌ఫోలియెట్ నవల పట్టుకుని, ఎంతో పోజ్ కొడుతున్న ఒక అబ్బాయి నా వైపు చూసి చిరునవ్వు నవ్వాడు. నార్త్ ఇండియన్‌లా వున్నాడు. అతని పేరు మనీష్, తనీష్ అలాంటిదే ఏదో అయి వుంటుంది అనిపించింది. వెంకట్రావు, నరసింహారావ్, రామ్ ప్రసాద్ అనిపించలేదు. ఎందుకో తెలుగు వారికి ఈ 'ష్' అన్న శబ్దం వచ్చే పేర్లు పెట్టుకోడానికి ఇన్ని దశాబ్దాలు పట్టింది. అదే ఆడపిల్లలయితే ఈజీగా ఏదో ఓ పురాణం తీసి సీతామాలక్ష్మి, కామాక్షి, మీనాక్షి, అని పెట్టేసేవారు. నాది మరీ సూపర్! సినిమాలు చూసి పెట్టారు. పాపం ఆ రుష్యేంద్రమణిగారు హీరోయిన్ కూడా కాదు. అంటే నాకు అంత సీన్ లేదనా?

అప్పటిదాకా బామ్మ అంటే వున్న ప్రేమపోయి మనసులో రివెంజ్‌లాంటిదేదో కలిగింది. అంజలీదేవి, బి.సరోజాదేవీ, సావిత్రీ, దేవికా ఎంతమంది హీరోయిన్‌లు లేరూ? ఈ హీరోయిన్ తల్లి పాత్ర ఏవిటి? ఆవిడ చాలా గాప్‌లు తీసుకుంటూ "అభిమన్యం... అభిమన్యం.. విన్నావా? మావయ్య ఏవన్నాడో? శశి నా కోడలు కాకపోతే ఒప్పుకోను" అనడం గుర్తొచ్చింది. వెంటనే పిజ్జా తినాలనిపించింది. ఈ రెండు ఫీలింగ్స్ కనెక్షన్ లేదు. అలా అనిపించింది అంతే. అనిపించగానే చేస్తాను.

పిజ్జా తెచ్చుకుని తింటుంటే, మనీష్ అని నేననుకున్న వ్యక్తి వచ్చి ఎదురుగా కూర్చుని "ఆర్ యూ ట్రావెలింగ్ ఎలోన్?" అన్నాడు.

"యా బేబీ సిట్టింగ్ చేస్తావా?" అనబోయి ఆగి తలవూపి సీరియస్‌గా తినడం మొదలు పెట్టాను.

"ఐ యామ్ ద్వారకా" అన్నాడు.

విచిత్రంగా చూసాను "అది పుణ్యక్షేత్రం కదా" అని.

"ద్వారకానందన్" అని నవ్వి "మీరు తెలుగువాళ్ళేగా?" అన్నాడు.

తల వూపాను.

"మేం కూడా మీరు నెట్‌ఫ్లిక్స్ తెలుగు సినిమా చూస్తున్నప్పుడు తెలిసింది" అన్నాడు.

నా రగ్గడ్ జీన్స్, విరబోసిన జుట్టూ, బామ్మ భాషలో బొట్టు లేకుండా సానలా వున్న మొహం, అన్నీ నా తెలుగుదనాన్ని దాచలేకపోయాయా? అనుకుని "మీరు తెలుగు వాళ్ళు అనిపించలేదు" అన్నాను.

"పేరుకే తెలుగు. పెరిగిందీ, చదివిందీ అంతా మహారాష్ట్రలోనే" అన్నాడు.

"అయితే ఇప్పుడేంటి?" అన్నాను వెనక్కివాలి. అతను కొంచెం కంగు తిన్నాడు.

"సియాటిల్ కేనా?" అడిగాడు.

"సియాటిల్ అయినా ఎయిర్‌టెల్ అయినా, ఫ్లయిట్‌లో సిగ్నల్స్ రావు. నేను ఎక్కగానే పడుకుంటాను" అన్నాను.

"దుబాయ్‌లో వెయిటింగ్ టైం వుంటుందిగా?" అని నవ్వి "మీ పేరూ? నేను చెప్పగానే చెప్తారనుకున్నాను" అన్నాడు.

"రుషి" అన్నాను.

"నైస్ నేమ్" అన్నాడు.

"బట్ ద్వారక నైస్ నేమ్ అని నేను అనుకోవడంలేదు" అన్నాను.

అతను నవ్వి "ద్వారక వెళ్ళి వచ్చాక, నేను పుట్టానుట" అన్నాడు.

"ఇంకా నయం నేపాల్, భూటాన్ వెళ్ళొచ్చాక పుట్టలేదు" అన్నాను.

"యూ ఆర్ జోవియల్" అన్నాడు.

"ఐ థింక్ ఐయాం బ్లంట్ అండ్ రూడ్... సారీ" అన్నాను.

"అలా అని ఎవరైనా చెప్పారా? అదేం లేదు" అన్నాడు.

"నేమ్ సేక్ చదివారా? ఝుంపా లహరీ దీ?" అని అడిగాడు.

అతను మళ్ళీ నేమ్ గురించి మాట్లాడగానే నాకు సన్నగా వణుకు. నా పేరు రుష్యేంద్రమణి అని తెలిసి ఇలా టాపిక్ మొదలెడ్తున్నాడేమో అని.

"చదివాను. సియాటిల్‌లో మీరు జాబ్ చేస్తారా?" అడిగాను.

"యా.. అవును. అక్కడే నేను సెటిల్ అయ్యాను" అన్నాడు.

"గ్రీన్ కార్డా?" అడిగాను.

"సిటిజెన్"

"ఓ.. ఎప్పుడెళ్ళారూ?"

"అక్కడే పుట్టాను. మామ్ లివ్స్ దేర్. డాడ్ ఇక్కడ వుంటారు, ఇండియాలో" అన్నాడు.

"ఓ..." డెలికేట్ మేటర్ అని ఆగిపోయాను.

"మీరూ? జాబ్ మీదేనా?" అడిగాడు.

"నో. మై ఆంట్ లివ్స్ దేర్. ఆవిడకి ఆరోగ్యం బాగోలేదని చూడ్డానికి వెళ్తున్నాను."

"ఎంతకాలం వుంటారు?"

"టూ మంత్స్"

"గుడ్.. షేర్ యువర్ నెంబర్. మనం మళ్ళీ కలవచ్చు?" అన్నాడు.

"వై?"

షాక్ తిన్నాడు.

"ఈజ్ ఇట్ లవ్ ఎట్ ఫస్ట్ సైట్? ఆర్ అలాంటిదే వేరే ఏదైనానా? లేదా నేను ఒంటరిగా ప్రయాణం చేస్తున్నాను అని జాలా? నేను ఏమైనా ఇంగ్లీష్ వింగ్లీష్‌లో శ్రీదేవిలా బేల చూపులు చూస్తున్నానా? అమితాబ్ వచ్చి హెల్ప్ చేసినట్లు ఫీల్ అవుతున్నారా?"

షాక్ పోయి అతని మొహంలో నవ్వు వచ్చింది. బాగా నవ్వి "నథింగ్ లైక్ దట్.. ఐ యామ్ నాట్ ఇన్ లవ్" అని ఆగాడు.

"మరి?"

"ఫ్లర్టింగ్.. తప్పా?" అడిగాడు.

ఈసారి నేను షాక్ తిన్నాను.

"ఒంటరిగా వున్నారు. నేనూ ఒంటరిగా జర్నీ చేస్తున్నాను. వై కాంట్ వీ హేవ్ సమ్ ఫన్? ఈ నెట్‌ఫ్లిక్స్ సినిమాలూ, బుక్ చదవడం ఎంతసేపు చేస్తాం? మాట్లాడుకుంటుంటే థ్రిల్ వుంటుంది కదా!" అన్నాడు.

"ఫ్లర్టింగ్?" వెనక్కి జార్లగిలబడి కూర్చున్నాను.

"ఇది ప్రయాణం వరకేనా? వెళ్ళాక కూడానా?" అన్నాను.

"సీ .. ఏ జర్నీ అయినా సరే... ఇంట్రెస్టింగ్‌గా చేసుకోవడమా? మానడమా అన్నది మన చేతిలో వుంటుంది. అందుకే మనసులో పెట్టుకోకుండా అడిగేసాను. మీకు నేను బోరింగ్‌గా వుంటే వద్దు" అన్నాడు.

చెవుల్లో ఇయర్ పాడ్స్ పెట్టుకున్నాను.

అతను తన పుస్తకం తెరిచి, అందులో తలదూర్చాడు.

బోర్డింగ్‌కి ఎనౌన్స్‌మెంట్ వచ్చింది. అంతా క్యూ కడుతున్నారు. అతను వెళ్ళి నిలబడ్డాడు. నేను వెళ్ళి అతని వెనకాల నిలబడి "మీ సీట్ నెంబర్ ఎంత?" అన్నాను.

"డి ట్వెల్వ్" అన్నాడు.

"మైగాడ్.." అన్నాను.

"వాట్?" అడిగాడు.

"డి థర్టీన్" అన్నాను.

"డెస్టినీ" అన్నాడు.

"యా.. సో పవర్‌ఫుల్" అన్నాను

ఫ్లయిట్ ఎక్కుతుంటే విష్ చేస్తున్న ఎయిర్ హోస్టెస్‌తో "లుకింగ్ వెరీ బ్యూటిఫుల్ మేమ్" అన్నాడు.

ఆమె అందంగా సిగ్గుపడి "థాంక్స్" అంది. అతను పెద్ద ఫ్లర్ట్, సందేహం లేదు. కానీ ఇందాక ఆమె సిగ్గుపడినట్లు అంత అందంగా నేను సిగ్గుపడగలనా? అనుకున్నాను. ఆమె బుగ్గలకి గులాబీరంగు వేసుకుంది. అవి ఇంకా ఎర్రగా అయ్యాయి.

పొగడ్తకి పడని వాళ్ళే వుండరు. నేను తప్ప అనుకున్నాను. ఎందుకంటే నాకు ఏదో కాంప్లెక్స్ వుంది. నేను గులాబీ రంగు బుగ్గలతో సిగ్గు పడలేను.

చామనఛాయ రంగు బుగ్గలతో కూడా సిగ్గుపడలేను. అసలు సిగ్గుపడలేను. నాలో ఆడపిల్ల లక్షణాలు లేవని బామ్మ అంటుంది. నిజమేనేమో? ఆ ఎయిర్ హోస్టెస్ నడుస్తుంటే ఎంత సౌకుమార్యం? ఆ ఎయిర్ హోస్టెసే కాదు, ఏ ఎయిర్ హోస్టెస్ నడుస్తున్నా. ఎంత సుకుమారంగా నడుస్తున్నారూ? తెల్లటి వేళ్ళకి ఎర్రటి నెయిల్ పాలిష్ వేసి, మంచినీళ్ళు అందించినా కొంపదీసి మత్తుగా వైన్‌లా వుంటుందేమో.

నేను ఐల్ సీట్ తీసుకున్నాను. అతను మిడిల్ సీట్, కిటికీ దగ్గర ఎవరో ముసలాయన.

"రిషీ.. డెస్టినీ చాలా పవర్‌ఫుల్" అన్నాడు ద్వారక.

"వీలైతే సీట్ మార్చుకోవచ్చు" అన్నాను.

విండో దగ్గర ముసలాయన, తన పాత్రని పరిచయం చేసుకుంటే "ఆర్ యూ గయ్స్ రీసెంట్లీ మేరీడ్?" అన్నాడు.

"ఇంటి దగ్గర నలుగురు పిల్లల్ని వదిలేసి వచ్చాం. మీకు రీసెంట్లీ మేరీడ్‌లాగా అనిపించామా?" అన్నాను.

ఆయన ఆశ్చర్యంగా చూసాడు.

"సారీ.. షీ ఈజ్ జోకింగ్.. మేం ఇద్దరం ఇక్కడే ఇప్పుడే పరిచయం అయ్యాం" అన్నాడు ద్వారక.

ముసలాయన కుండ పగిలిన ధ్వనితో పెద్దగా నవ్వాడు. నేను ఉలిక్కిపడ్డాను.

"ఐ లవ్ జోక్స్. నేను డాక్టర్ శివరామన్" అని ద్వారకకి చెయ్యి కలిపి, అతి కష్టం మీద నావైపు చెయ్యి జాపబోయి, ఆయన బొజ్జ అడ్డొచ్చి ఆగిపోయాడు.

నేనే కొంచెం ముందుకి ఒంగి ఆయన వేళ్ళ చివరలు తాకాను.

తర్వాత డా.శివరామన్‌ని ముద్దు పెట్టుకోవాలి అనిపించింది. అంతగా అతను ద్వారకని తన గురించీ, అమెరికాలో వుంటున్న కూతురూ, అల్లుడూ, మనవల గురించి చెప్పి విసిగించడం మొదలు పెట్టాడు.

ద్వారక నావైపు అసహనంగా చూస్తే చెప్పాను

"డెస్టినీ"

"నేను కల్నల్‌గా వున్నప్పుడు కార్గిల్ వార్లో ఓసారి" శివరామన్ తన ఎక్స్‌పీరియన్సెస్ చెప్తున్నాడు. నేను సిగ్నల్స్ లేక ఫోన్ తీసేసి, కళ్ళు మూసుకున్నాను.

ఫ్లయిట్ టేకాఫ్ అయింది. ద్వారక దగ్గరనుండి సన్నగా లెమెన్‌గ్రాస్ ఓడర్.. బహుశా డియోడ్రెంట్ అనుకుంట. నాకు నిద్రొచ్చేసింది. చెవిలో ఎవరో మిక్సీ సౌండ్ చేస్తున్నారు. కొబ్బరి ముక్కలు వేస్తే అవి టకటకలాడ్తూ వచ్చే మిక్సీ ధ్వని కళ్ళు తెరిచి చూస్తే ముసలాయన గురకపెడుతున్నాడు. ద్వారక నవల చదువుకుంటున్నాడు.

"హలో ద్వారకా" అని పిలిచాను.

కళ్ళెత్తి కనుబొమలతోనే "ఏంటి?" అన్నాడు.

"మీకు ఆ గురక శబ్దం ఎలా వుందీ?"

"ఏ గురక శబ్దం?"

"అదేంటీ ముసలాయన మీ చెవిలో పెడుతున్న గురక? వినిపించడంలేదా?"

"అయితే" అన్నాడు.

ఇంకా ఆశ్చర్యంగా చూసాను.

"జలపాతం దగ్గర కూర్చుని బుక్ చదువుకుంటూ, ఆ జలపాతం చేసే హోరు డిస్టర్బెన్స్ అనుకుంటే ఎలా? ఏ సిట్యుయేషన్‌లో అయినా వుండగలగాలి" అన్నాడు.

ఆ పాయింటే నేను ఆలోచిస్తుండగా, ఎయిర్‌హోస్టెస్ ఫుడ్ తీసుకొచ్చింది.

"వెజిటేరియన్" అన్నాను.

"ఎస్.." ఆమె వెజ్ ట్రే నాకు ఇచ్చింది.

"వెజిటేరియన్ బై ఛాయిస్?" ద్వారక అడిగాడు. అతను చికెన్ తింటున్నాడు. నేను సలాడ్ తింటూ ఆలోచనలో పడ్డాను. నేను పుట్టగానే పప్పన్నం, పెరుగన్నం పెట్టారు. బామ్మ ఎవరింట్లో అయినా నేను అన్నం తింటానంటే, "వొద్దు వాళ్ళు చేపలూ, మాంసం పెడ్తారు" అని అదేదో తప్పు పని అనేట్లు చెప్పేది.

అసలు నాకు అది ఇష్టమా? ఇది ఇష్టమా? అనే ఛాయిస్ పెద్దవాళ్ళు ఇవ్వలేదు. నాకూ తెలియలేదు. యాషిక చికెన్ నా ప్లేట్‌లో పెట్టుకుని తిన్నా, నాకు అభ్యంతరం లేదు. అలాగని నేను తినలేను.

"చాలా చిన్నప్పుడు మటన్ షాప్ ముందునుండి వెళ్తుంటే, మటన్ షాప్‌లో రక్తం కారుతున్న మటన్‌ని వేలాడ కట్టడం చూసాను. అప్పటినుండి తెలీని అయిష్టం. అందుకే ట్రై చెయ్యలేదు. పైగా "మనం తినకూడదు" అని పెద్దవాళ్ళు గట్టిగా బ్రెయిన్‌ని కండీషనింగ్ చెయ్యడం కూడా" అన్నాను.

"అంతే! అలవాటు.. నేను చికెన్, ఫిష్, మటన్ తింటా. అంతేగానీ నాగలాండ్‌లో కెళ్ళి పురుగులూ, చైనా వెళ్ళి పాములూ తినలేనుగా" అన్నాడు.

శివరామన్‌గారు లేచారు. ఫుడ్ చూసి "అబ్బా! మా అమ్మాయి వెజ్ అని ప్రిఫరెన్స్‌లో రాసింది. ఇంట్లో ఎలాగూ తప్పదు. ఫ్లయిట్‌లో అయినా నన్ను నాన్ వెజ్ తిననివ్వచ్చుగా" అని నవ్వారు.

ఆర్మీలోంచి వచ్చిన ఆయన కూడా వెజిటేరియన్ తినాలని ఇంట్లో వాళ్ళు అనుకుని, ఆయన ఫుడ్ డిసైడ్ చెయ్యడం నాకు ఆశ్చర్యం అనిపించింది.

"ఫుడ్ మనుషులని దగ్గర చేస్తుంది తెలుసా?" శివరామన్ సాంబార్ అన్నం తింటూ చెప్పారు.

"మీరు ఏ ప్రదేశానికి వెళ్ళి అక్కడ వింతలూ, అందాలూ ఎన్ని చూసినా, అక్కడ ఫుడ్ బాలేకపోయినా, బావున్నా ఎన్ని ఏళ్ళు అయినా గుర్తుపెట్టుకుని చెప్తారు. అది వండి పెట్టిన వాళ్ళని మర్చిపోరు" అన్నారు.

"నిజమేకదా" అన్నాను. చిన్నప్పుడు అమ్మమ్మగారింటికి శెలవులకి వెళ్తే అమ్మమ్మ వెన్నపూస నంజి పెట్టిన గోంగూర పచ్చడి రుచీ, ఇంట్లో చుట్టిన పూతరేకులూ, ఆవి ఈనిందని, వండిపెట్టిన జున్నూ. అన్నీ నాకూ తమ్ముడికీ ఎంత గుర్తో? అలాగే డబ్బా మూర్తిగారు అనే నాన్న స్నేహితుడి ఇంటికి వెళ్తే వాళ్ళావిడ పెట్టిన వేగీ వేగని బెండకాయకూరా, చలివాసనొచ్చిన ఊరగాయీ, రాళ్ళలాంటి ఇడ్లీలూ.. ఇప్పటికీ తలుచుకుంటాం ఏదో ఒక సందర్భంలో. ఫుడ్ చాలా ఇంపార్టెంట్.

"మా బెటాలియన్ సౌత్ ఇండియన్స్ తక్కువ. మా జవాన్ రాంసింగ్ ఎప్పుడూ రోటీలోకి సెనగల కూర చేసేవాడు.

నేను "కొంచెం చింతపండు వాడు పప్పులోకి.. ప్లీజ్.. సాంబార్ నేర్చుకోరా అనేవాడిని. కానీ వాడు ఓ నాడు తూటాకి నేలకొరిగాక తెలిసింది. ఇంక మళ్ళీ జన్మలో అంతటి రుచికరమైన సెనగల కూర తినలేమని..."అన్నారు శివరామన్. ఆయన కళ్ళల్లో నీటి తెర

"we dont know when we are making a memory" అన్నాడు ద్వారక.

"Good quotation" అన్నారు శివరామన్.

మనిషికి చాలా ఇష్టమైనవి ఫుడ్, నిద్రా అనుకున్నాను. ఆకలి రుచెరగదు, నిద్ర సుఖమెరగదు. నేను బన్‌కి వెన్నపూస్తూ, ద్వారక చెప్పిన సెంటెన్స్ నెమరేసుకున్నాను. మనం ఇతరులకి ఓ స్మృతి ఇస్తున్నామని మనకి అప్పుడు తెలీదు. కానీ వారు తిరిగి ఎన్నాళ్ళకో, ఎక్కడో కలిసి చెప్పినప్పుడు తెలుస్తుంది. అవే జ్ఞాపకాలు.. మధురమైనవీ, బాధాకరమైనవీ కూడా. మళ్ళీ గురక పెడ్తున్న శివరామన్‌ని చూస్తూ అనుకున్నాను.

దుబాయ్‌లో వెయిటింగ్ టైములో పెద్ద కష్టం అనిపించలేదు. పడుకోడానికి ఈజీ చైర్స్ వున్నాయి. బోలెడు షాప్స్. చుట్టూ ఎంచక్కా. ఒక్కదాన్నే కాసేపు తిరిగాను. కాఫీ తాగాను. కార్డ్ మీద పే చేసాను.

నేను వచ్చేసరికి ద్వారక ఓ అందమైన అమ్మాయితో మాట్లాడుతున్నాడు. ఆమె బుగ్గలు ఆల్‌బకరా పళ్లలా ఎర్రబడ్తున్నాయి. నాలో ఓ సన్నని ఈర్ష్యా వీచిక వీచింది. ఫ్లర్టింగ్ మొదలెట్టేసాడు అనుకున్నాను.

నేను కొంచెం దూరంగా కూర్చున్నాను.

"ఏయ్ కమ్ హియర్. షీ ఈజ్ లేపాక్షి. నా పేరు లాగే పిలిగ్రిమేజ్ పేర్లు" అని నవ్వాడు.

అందరికీ అందమైన పేర్లు పెడ్తారు. నాకెందుకో ఇలా.. అనుకున్నాను. ఈర్ష్యకి లాజిక్ వుండదు. ఓసారి స్టార్ట్ అయితే అన్నింటికీ కలుగుతుంది. ఆమె చాక్‌లెట్ తింటూ అతనికో ముక్క ఇచ్చింది. అతను తింటూ నా వైపు చూసి నాకూ ఆఫర్ చెయ్యబోయాడు. అప్పటికే కొరికాడు. అందుకే వద్దు అన్నాను. ఆమె పొట్టి బాబ్డ్ హెయిర్, బుగ్గల్లో పడే సొట్టలు. సరికొత్త బ్రాండ్ ఎటాచీ, కాలికి వేసుకున్న స్లిపాన్స్, బ్రాండెడ్ హేండ్ బ్యాగ్. అన్నీ ఈర్ష్య కలిగించాయి. చాలా గొప్పింటి పిల్లలా వుంది. అందంగా వుంది. ఫ్లర్టింగ్‌కి రెడీగా వుంది.

ఆ ఇద్దర్నీ చూస్తుంటే, లివ్ ఇన్ ద మూమెంట్‌కి ఓ ఉదాహరణలా అనిపించారు. రేపు ప్రొద్దుట ఎవరి గమ్యాలు వాళ్ళవి. ఎవరి జీవితాలు వాళ్ళవి. ఎవరి వ్యాపకాలు వాళ్ళవి. అసలు మళ్ళీ కలవము. కలిసే ఛాన్స్ ఎందుకొస్తుందీ? శివరామన్ గురక మళ్ళీ వింటామా? ద్వారక నాకు సగం కొరికిన చాక్లెట్ ఆఫర్ చేస్తాడా? లేపాక్షి నన్ను చూసి బుగ్గలు సొట్ట పడేట్లు నవ్వుతుందా? ఇన్నివేల మంది నా చుట్టూ వున్న వాళ్ళని మళ్ళీ చూస్తానా? దేవుడు వేసే బొమ్మల్లో, ఎన్ని రేఖలు ఇసకలో రాతల్లా చెరిగిపోయి, మళ్ళీ ఆ స్థానంలో కొత్త రూపులొస్తాయో! తలుచుకుంటే అంతా మిధ్య .. ఇదంతా అశాశ్వతం అనిపించదూ. మా బోర్డింగ్ మొదలయింది. మళ్ళీ ద్వారక పక్కన వస్తాడన్న నమ్మకం లేదు. మీ సీట్ నెంబర్ ఎంత? అని అడగాలన్న కుతూహలాన్ని పట్టి పంటికింద పెదవితోబాటు బింగించేసాను.

సియాటిల్ ఫ్లయిట్‌లో మళ్ళీ 'డెస్టినీ' అని నవ్వుదాం అనుకున్నా, నా సీట్ పక్కనున్న ద్వారకని చూసి. కానీ విండో సీట్ దగ్గరున్న లేపాక్షి నవ్వి "హాయ్ వెల్‌కమ్" అంది. మనసు కొద్దిగా చేదు తింది. ద్వారక ఓ రకంగా చూసి "కమ్ ఆన్ ఏంజిల్.. ఫస్ట్ ఆఫర్ నీకే ఇచ్చాను. తీసుకోలేదు" అన్నాడు.

పక్కన చెవిలో మిక్సీ శబ్దంలా డా. శివరామన్ వచ్చినా బావుండేది. ఇప్పుడు వీళ్ళిద్దరి గుసగుసలూ కందిరీగల రొదలావుంది. చెవుల్లో ఐపాడ్స్ పెట్టుకుని మ్యూజిక్ ఆన్ చేసుకున్నాను. కాసేపటికి ఫుడ్ వచ్చింది. కళ్ళు తెరిచి చూస్తే లేపాక్షి ద్వారక భుజం మీద ఆనుకుని నిద్రపోతోంది. అతను లేపి ఆమెని ఫుడ్ తినమన్నాడు.

"ఏంజిల్ యువర్ ఫుడ్ ఈజ్ రెడీ" అతని గొంతు నా చెవుల్లో గింగురుమంది. ఫ్లర్టింగ్ అంటే ఇదే కదా.

లేపాక్షి కిలకిలా నవ్వుతూ అతని నోట్లో చికెన్ పీస్ పెట్టి, కొరికాక తనూ తింది. సలాడ్, గులాబ్‌జామ్ తీసి "మీకూ కావాలా?" అని నన్ను అడిగాడు ద్వారక.

"నో!" అన్నాను.

నా గొంతు హర్ష్‌గా వుంది. నేను ఎంత ఫూలిష్‌గా బిహేవ్ చెయ్యగలనో తెలిసి నాకే వెగటుగా వుంది. అతను స్నేహ హస్తం చాస్తే వద్దు అన్నాను. అతను పరిచయం అయిన కొన్ని గంటలలో అతని మీద ఏదో హక్కులు పొందినట్లు ఫీలయి, జెలసీ చూపిస్తున్నాను. అసలు అతనెవరు? నాకేం తెలుసు అతని గురించి? అతను చెప్పబోతే విన్నానా? నా గురించి కుతూహలం కనబరిస్తే ఏమైనా చెప్పానా?

'చింతల చెలి నీవు... కోర్కెల వల నీవు.. నాటక రంగానివే మనసా... తెగిన పతంగానివే..."

ఇప్పుడు చూస్తుంటే ద్వారక నవ్వూ, అతను తల దువ్వుకునే పద్ధతీ, భుజాలు ఎగరేసి మాట్లాడడం, చేతులు వూపడం అన్నీ చాలా స్టైలుగా భలే నచ్చేసాయి. ఇందాక కన్నా ఇప్పుడు పక్క సీట్‌లో లేపాక్షి వచ్చాక ఎక్కువగా నచ్చడం. దీన్ని ఏమంటారు? పిచ్చా? కళ్ళు ఎదురుగా వున్న సినిమా తెరకి అతికించాలి అని ఎంతో ప్రయత్నించాను. తెలుగు డబ్బింగ్‌లో సూపర్ హీరోస్ మూవీ 'థోర్', 'పిల్లకాయలూ పాప్ కార్న్ తెచ్చుకుని సూడండి. నా ఫైటింగ్" అంటున్నాడు బ్రాడ్‌పిట్. ఓ మైగాడు ఈ తెలుగు డబ్బింగ్ కన్నా పక్క సీట్‌లో జంట రొమేన్స్ చూడటమే తక్కువ శిక్ష అనిపించింది.

క్రీగంట చూస్తే, ద్వారక ఆమె కళ్లమీద పడ్తున్న జుట్టు సవరిస్తున్నాడు. ఇయర్ ఫోన్స్ తీసేసి కళ్ళు మూసేసుకున్నాను.

ఇందాకేగా అనుకున్నాను. ఎవరూ శాశ్వతం కాదు. మళ్ళీ నా చుట్టూ వున్న జనం జీవితంలో నాకు కనపడను కూడా కనపడరు అని. మరి ఎందుకీ బాధ? అంతలోనే ఏర్పరుచుకునే ఎటాచ్‌మెంట్ పేరేంటి? ఇన్‌ఫ్యాక్చుయేషనా? ఫూలిష్‌నెస్సా? లేక.. ప్రేమా?

సియాటిల్ సమీపిస్తోంది. వెదర్ స్నోయీగా వుంది అంటూ ఎనౌన్స్‌మెంట్ వచ్చాక, ద్వారక నావైపు తిరిగి "ప్లీజ్ షేర్ యువర్ ఫోన్ నెంబర్?" అన్నాడు.

నాలో ఏదో జ్వాల రేగి "డెస్టినీ వుంటే కలుస్తాం" అని లేచి కేబిన్ లగేజ్ తీసుకోవడంలో పడ్డాను.

"వెయిట్" అతను నన్ను చనువుగా వీపుమీద చెయ్యివేసి లాగి, నా ఎటాచీ తీసి ఇచ్చాడు.

"ఐ బిలీవ్ ఇన్ డెస్టినీ" అన్నాడు.

లేపాక్షికి కూడా ఆమె సామాన్లు అందించడంలో బిజీ అయిపోయాడు. నేను భారమైన మనసుతో ముందుకి నడిచాను.

"ప్లీజ్" అంటే అతని సొమ్ము ఏం పోయేదీ? అనిపించింది.

ఇస్తే నా సొమ్మేం పోయేదీ? ఈగో పోయేది..

ఎయిర్‌పోర్ట్‌లో దిగాక నేను బ్యాగేజ్ కలెక్ట్ చేసుకుని, బయటకి రావడమేగా అనుకుంటూ నడిచి వస్తుంటే 'ఇమిగ్రేషన్ కి వెళ్ళాలి ముందు' అని ద్వారక అనడంతో లైనులో నుంచుని, ఏమి అడుగుతారో, ఏమి చెప్పాలో ముందే ప్రిపేర్ చేసారు కాబట్టి నా వంతు రాగానే విండో దగ్గరకి వెళ్ళగానే 'ఎందుకొచ్చావ్? ఎన్నాళ్ళుంటావ్?' అని ఇమిగ్రేషన్ ఆఫీసర్ అడగగానే తడుముకోకుండా సమాధానం చెప్పేసరికి స్టాంప్ వేసి పంపించేశాడు ఆఫీసర్.

బ్యాగేజ్ కలెక్ట్ చేసుకోవాలి అంటే  ట్రామ్ ఎక్కాలి. అమ్మో కరెక్ట్‌గా దిగగలనో లేదో అని చుట్టూ చూసాను.

"కమ్ దిస్ వే" ద్వారక నన్ను చెయ్యిపట్టి తీసుకెళుతూ అన్నాడు. ట్రెయిన్‌లో ఎదురెదురుగా నిలబడినప్పుడు నా ఫోన్ నెంబర్ చెప్దాం అనుకున్నాను. ఇంతలో ట్రెయిన్ ఆగడం ఆ కుదుపుకి అతని మీద పడడం జరిగిపోయాయి. అతను చటుక్కున తన పెదవులు నా పెదవుల మీద వత్తి వదిలేస్తూ "టేక్ కేర్" అన్నాడు. అంతే. ఒక్కసారిగా బాడీ మొత్తం పారలైజ్ అయినట్లు అయి ఇంక ఏం మాట్లాడలేకపోయాను. కిందకి దిగాం.

అతనే లగేజ్ కలెక్ట్ చెయ్యడానికి సాయం చేసాడు. డాలర్స్ వేసి ట్రాలీ తెచ్చి అందులో పెట్టి బయటకి తెచ్చాడు. బయట మావయ్యా పరిమళా నిలబడి వున్నారు.

"రిషీ" అంటూ వచ్చి పరిమళ నన్ను చుట్టుకుంది. మావయ్యకి కూడా హగ్ ఇచ్చి ద్వారక కోసం చూసాను. అతను లేడు. నన్నూ లగేజ్‌నీ తీసుకుని "కమ్.. కమ్. ఎలాగైపోయావో చూడు ఉప్పు గోంగూరలా" అని మావయ్య జోక్ చేస్తూ, ముందుకి నడిపించారు కారువైపు.

ఎయిర్‌పోర్ట్ దాటేదాకా నా కళ్ళు వెతుకుతూనే వున్నాయి.

COMMENTS